

ఈశ్వరుని అసిత్వ తత్వజ్ఞానం

ఈశ్వరుని అస్తిత్వ తత్వ జ్ఞానం

ఓమిత్యేవ సునామధేయ మనఘం విశ్వాత్మనో బ్రహ్మణః
సర్వేష్వేవ హి తస్య నామసు వసోరే తత్ప్రధానం మతమ్।
యం వేదా నిగదన్తి న్యాయనిరతం శ్రీ సచ్చిదానన్దకమ్।
లోకేశం సమదర్శినం నియమనం చాకారహీనం ప్రభుమ్।

అర్థం:- ఎవరిని వేదాలు న్యాయకారుడు, సచ్చిదానందుడు, విశ్వానికి స్వామి, సమదృష్టి గలవాడు మరియు నిరాకారుడు అని చెబుతున్నాయో, ఆ విశ్వ ఆత్మ, ఆ బ్రహ్మయొక్క సమస్త నామాలలోకి శ్రేష్ఠ నామం, ధ్యాన యోగ్యమైన 'ఓం' ముఖ్యనామంగా గుర్తించబడుతుంది.

గాయత్రీ మంత్రానికి ముందు 'ఓం' కలుపబడుతుంది. 'ఓం' పరమాత్మ ప్రధాన నామము. భగవంతుడిని అనేక నామాలతో పిలుస్తారు. 'ఏకం సద్విప్రా బహుధా వదన్తి'. ఆ

ఒకే పరమాత్మను బ్రహ్మవేత్తలు అనేక రకాలుగా చెబుతుంటారు. విభిన్న భాషలు, సంప్రదాయాలలో ఆయనకు అనేక పేర్లు ఉన్నాయి. ఒక్కొక్క భాషలో ఈశ్వరుని సమానార్థం గల అనేక పేర్లు ఉంటాయి. అయినా ఆయన ఒక్కడే. ప్రకృతిని నిర్వహించే గతివిధులను తమ యోగ బలంతో చూడగలిగిన మన ఋషులు సమాధి అవస్థలో ఉన్నప్పుడు ఈ ప్రకృతి అంతరాళాల్లో ఒక ధ్వని ఉత్పన్నమవుతుందని అది 'ఓం' శబ్ధంలాగా వుంటుందని కనుగొన్నారు. అందువలన భగవంతుని నామాలలో 'ఓం' కు ప్రాధాన్యత ఇవ్వబడింది. సూక్ష్మ ప్రకృతి ఈ భగవన్నామాన్ని ప్రతిక్షణం జపిస్తూ, ఉద్ఘోషిస్తూ వుంటుంది. ఇందువలననే దీనిని సహజసిద్ధమైనది, దైవం అనీ స్వయం ఘోషితం, ఈశ్వరుని నామం సర్వ

శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది.

ఆస్తికత అనగా సత్వగుణాలను,దైవత్వాన్ని, భగవంతుడ్ని, పరమార్థ భావనల్ని హృదయంగమం చేసుకోవడం. తామస, అసుర, సైతానీ, భోగవాద, స్వార్థపర కోరికలలో మునిగి ఉండడం నాస్తికత. భగవంతుడు మంచి, చెడు రెండింటిలోనూ వుంటాడు. అయితే పూజించే, భజన చేసే, ధ్యానించే ఈ ఈశ్వరుడు సత్వగుణాలకు ప్రతీక. ఒక సువిస్తృత రాజ్యానికి ప్రతీకగా ఒక జాతీయ పతాకం ఉంటుంది. ఏదైనా విదేశం ఆ పతాకాన్ని గౌరవించినా లేదా అవమానించినా ఆ దేశాన్ని గౌరవించడం లేదా అవమానించడంగా భావించవచ్చు. ఇదే ప్రకారం మానవుల అంతఃకరణాలలో నివాసముండే వ్యాపక సత్వ గుణాలకు ప్రతీక అయిన ఈశ్వరుడ్ని

మనం పూజిస్తాము. ఈశ్వరుని ప్రతిష్ఠించడం, పూజ, ఉపాసన, ప్రశంస, ఉత్సవాలు, కథాగానం, యాత్రలు మొదలయిన వాటి తాత్పర్యం సత్వగుణాల పట్ల మన అనురాగాన్ని ప్రకటించడం, వాటిని హృదయాంగమం చేసుకోవడం, వాటిలో తన్మయులు కావడం. ఈ ప్రక్రియలతో మన మనసు పవిత్రమవుతుంది. మన ఆలోచనలు, కార్యాలు, వ్యక్తిగత మరియు సామూహిక జీవితంలో సుఖశాంతులను సృష్టిస్తాయి. ఈశ్వర ఉపాసన యొక్క మహా ప్రసాదం సాధకునికి అంతరాత్మలో సత్వగుణ వృద్ధి రూపంలో తక్షణమే లభించడం ప్రారంభమవుతుంది.

గాయత్రీ గీతలోని పై ప్రథమ శ్లోకంలో ఈశ్వరుని అనేక లక్షణాలు చెప్పబడ్డాయి. అవి

న్యాయకారి, సమదృష్టిగలవాడు, నియామకుడు, మరియు నిరాకారుడు. విశ్వ ఆత్మ విశ్వంలోని సమస్త ప్రాణులలో ఆత్మ రూపంలో ఆయన నివసిస్తాడు. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాలు అంతఃకరణ చతుష్టయాలు. అవి వికృతం కావడం వలన అజ్ఞానము, మాయ, స్వార్థము, భోగాల మలినం అంటుకోవడంతో మానవులు దుర్మార్గపు ఆలోచనలతో దుర్మార్గంలో పడిపోవడం చూడవచ్చు. అయినా కూడ అంతరాత్మ ఈశ్వరుని అంశ కావడం వలన లోపల్నుండి సన్మార్గంలో నడవాలనే ఆదేశిస్తుంది. ఆ అంతర్మా పిలుపును విని ఆ సంకేతాలను అనుసరించగలిగితే ఎంత చెడ్డ వారైనా కొద్ది సమయంలోనే శ్రేష్ఠమైన గొప్ప వారుగా తయారు కావచ్చు. అన్నీ వదలివేసి నా శరణంలోకి రండి అన్ని పాపాల నుండి

విముక్తులు చేస్తాను. అని భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. అంతరాత్మను, పరమాత్మను శరణుకోరి ఆత్మ సమర్పణ చేసుకోవడం వలన, దైవీ ప్రేరణలను హృదయంగమం చేసుకోవడం వలన మనిషి ఈశ్వరునికి నిజమైన భక్తుడవుతాడు. భగవంతుని ప్రత్యేక్షరూపమే భక్తుడు.

కనుక భగవంతుడు ప్రతి ఆత్మలో నివాసముంటాడు. అందువలన ఏ వ్యక్తిని దుష్టునిగా చూడ కూడదు. ద్వేషించకూడదు. దుర్మార్గపు ఆలోచనలు, దుష్టకార్యాలనే మనం ద్వేషించాలి. దుష్టత్వం ఒక రోగం. రోగాన్ని తరిమికొట్టి రోగిని కాపాడడం కోసం ఎంతో ప్రయత్నం చేయాలి. అదే విధంగా దుష్టత్వాన్ని తొలగించి దుష్టులైన వారిని సజ్జనులుగా

మార్చడం కోసం అంతే ప్రయత్నాన్ని చేయాలి. ఆత్మ మూల స్వరూపం దైవం. అందువలన ప్రయత్నం చేయడంతో చెడు దూరమవుతుంది. ఆత్మలో భగవంతుడుంటాడు. పుండును పగులగొట్టించిన విధంగానే దండన ద్వారా సంస్కరించవచ్చు. అయితే ఎవరి పట్ల మనసులో ద్వేషానికి తావివ్వకూడదు.

ఈశ్వరుడు సర్వవ్యాపి. అందువలన ఆయన ఓక దేశానికి సంబంధించిన వాడు కాదు. ఆయన ఆత్మ స్వరూపుడు. అందువలనే నిరాకారుడు అయినా కూడ ఈ నిర్మాణం అంతా ఆయనదే కావడంతో, అంతటా నిండివుడడంతో సాకారుడే. ఏ మహాపురుషులలోనో ఆయన యొక్క విశేష శక్తులు, విశేష కళలు వుంటాయి. అప్పుడు ఆ కళల అవతారంగా చెప్పుకోవచ్చు

పరశురామునిలో మూడు కళలు, రాముడిలో పన్నెండు కళలు, కృష్ణుడిలో పదహార కళలున్నాయని చెప్పబడింది.

ఒకే సమయంలో ఎన్నో అవతారాలు, ఎంతోమంది మహాపురుషులు వుండవచ్చు. రాముడు, పరశురాముడు ఒకే సమయంలోని రెండు అవతారాలు. భగద్గీత ప్రకారం 'అధర్మం వృద్ధి చెందినపుడు ధర్మస్థాపన కోసం అవతారాలు వుంటాయి'. ఆ అవతార పురుషులు ఒంటరిగానే అంతా చేయలేరు. అయితే ప్రజలలో నూతన ఆలోచనలను, ఉత్సాహాన్ని ప్రవేశపెట్టి మేలుకొల్పుతారు. అనేక మంది ఆసరాతో ఆ ఈశ్వరీయ ఉద్దేశ్యాన్ని పూర్తి చేస్తారు. కృష్ణుని ద్వారా కౌరవుల నాశనం, రాముడి ద్వారా రాక్షసనాశనం ఒంటరిగానే జరగలేదు. వారికి

అపారజనసమూహం అసరగా నిలబడి విజయం చేకూర్చింది. దోషాలను తొలగించి, మంచిని స్థాపించే కార్యక్రమం ఎక్కడ జరిగినా దాని వెనుక ఈశ్వరుని ప్రేరణ వుంటుంది. అవతార పురుషులు దానిని పూర్తి చేయడానికి ముందుకు వస్తారు. చివరిలో ప్రజల సహకారంతో ఆ ఉద్దేశ్యం పూర్తవుతుంది. అలాంటి అవతార ప్రక్రియలు చిన్న పెద్దరూపాలలో నిరంతరం జరుగుతూనే వుంటాయి. పెద్ద పెద్ద అవతార ప్రక్రియలో అప్పుడప్పుడు ప్రత్యేక అవసర సమయంలో వస్తాయి. అవతార కార్యాలలో సహాయపడడం హనుమంతుడు, అర్జునుడు లాగా యశస్సును, ప్రతిష్ఠను పొందడమే అవుతుంది.

పరమాత్మ భట్రాజులండే ఇష్టపడడు. ఎవరి స్తుతిగాని నిందగాని ఆయనకు అవసరంలేదు.

ఆయన ఎవరి మీద ప్రసన్నుడు కాడు. అప్రసన్నుడు కాడు. పూజ, ఉపాసన అనేవి మన ఆత్మ బలాన్ని పెంచే ఒక రకమైన ఆధ్యాత్మిక వ్యాయామము. సత్వగుణాలు వృద్ధి చెందుతాయి ఈశ్వరుని సర్వవ్యాపిగా భావించేవారు పాపాలకు భయపడతారు. పోలీసు ముందు వున్నప్పుడు చోర స్వభావం కలవారు కూడ సాధువులుగా అభినయిస్తారు. అందరికంటే పెద్ద పోలీసు అయిన భగవంతుని తమలోపల బయట నాలుగు చెరగులా చూడగలిగినవారు ఆయన విధించే దండనకు భయపడతారు. పాపాలు చేయలేరు. ప్రాణికోటిలో ఈశ్వరుని సర్వవ్యాపకునిగా చూడగలిగే వారు అందరితో మంచి వ్యవహారాలే నడుపగలగుతారు. ఇలాంటి ఈశ్వరీయ దృష్టిని పొందడం ఈశ్వరారాధన

ప్రధమ ఉద్దేశ్యం. ధ్యానం, ప్రార్థన, పూజ, కీర్తన, జపం మొదలైన మనోవైజ్ఞానిక క్రియలు మనసులో దాగి ఉన్న అనేక చెడు సంస్కారాలను తొలగించి మంచి సంస్కారాలను స్థాపిస్తాయి. ఈశ్వరుని పేరు మీద లోకహిత కార్యాల కోసం దానం ఇవ్వడం అనేది మన వ్యక్తిగతంగానే గాక సామూహిక సత్వగుణాలను వృద్ధి చేయడమే అవుతుంది.

ఆయన సమదృష్టి కలవాడు. పుత్రులందరు ఆయనకు ప్రియపాత్రులే. అందరూ సమానమే. నిష్పాక్షిక న్యాయాధికారిగా అందరికి వారి కర్మల ఆధారంగా ఫలితాన్నిస్తాడు. వారివారి మంచి, చెడు కర్మల పరిపక్వమే కాలాంతరాన ప్రారబ్ధం, భాగ్యం, కర్మరేఖలు, ఈ భగవంతుని కృప, దైవీ వరదానం, గ్రహదశ మొదలయిన రూపంలో

బయటపడతాయి. కర్మలు ఇప్పటివైనా, పాతవైనా వాటి ఫలితం మనకు లభించి తీరుతుంది. ఈశ్వరుని తనకు తానుగా ఎవరినీ ప్రత్యేక కోపంగాగానీ, ప్రేమగా గానీ చూడడు. ఆయన అందరికీ అత్యంత విలువైన శరీర రథాన్ని, విలక్షణమైన మస్తిష్కం అనే అస్త్రాన్ని, సృష్టిలో లభించే ఎన్నో సుఖదాయకమైన వస్తువులను ఇచ్చి తన దయార్ద్రతను చాటుకున్నాడు. మంచి, చెడు కర్మల ద్వారా జీవితాన్ని సుఖవంతంగా లేదా దుఃఖమయంగా చేసుకోనే బాధ్యత మనదే. ఆయన ఎవరి క్రియా కలాపాలలోను జోక్యం చేసుకోడు. తమ ఇష్టం వచ్చిన పనులు చేసుకోవడానికి అందరికీ సంపూర్ణస్వాతంత్ర్యం ఇచ్చాడు. కర్మఫలం నుండి ఎవరూ తప్పించు కోలేరు. ప్రతి ఒక్కరూ దాన్ని అనుభవించ

వలసిందే. న్యాయాధీశుడైన ఈశ్వరుని న్యాయం నుండి ఎవరూ తప్పించు కోజాలరు.

ఆయన నియామకుడు. స్వయంగా నియమ రూపుడు. ఆయన ప్రతి పని నియమ పూర్వకం గానే జరుగుతూ వుంటుంది. గ్రహనక్షత్రాలు ఒక్క క్షణం కూడ ముందు వెనుక ఉదయించడం, అస్తమించడం జరుగదు. బియ్యం నుండి బియ్యమే ఉత్పత్తివుతాయి. వస్తువులు తమ తమ గుణాలను ధారణ చేసి వుంటాయి. ఎప్పుడయినా నియమాలు తప్పినట్లు కనిపిస్తే అది కూడ ఏదో సూక్ష్మ నియమాల ఆధారంగానే జరుగుతుంది. ఈశ్వరీయ నియమాలను పాటించేవారు. ప్రాకృతిక జీవనాన్ని జీవించేవారు, కర్తవ్య ధర్మంలో స్థిరంగా వుండేవారు ఈశ్వరుని ఆనందమయ సృష్టి యొక్క ఆనందాన్ని

ఆస్వాదిస్తారు. నియమాలను ఉల్లంఘించేవాడు చెడిపోక తప్పదు. అగ్ని దయాళుడు. చలిని నివారిస్తాడు. భోజనాన్ని వండిస్తాడు. ఆవిరి యంత్రాన్ని నడిపిస్తుంది. ఇంకా అనేక ప్రయోజనాలున్నాయి. అయితే దానిని నియమ విరుద్ధంగా తాకితే చేతులను కాల్చుతుంది. విద్యుత్‌తో అనేక ప్రయోజనాలు మనం పొందుతున్నాము. అయితే దానిని పొరపాటున తాకితే ప్రాణాలు తీస్తుంది. ఇదే ప్రకారం భగవంతుడు మనకు అనేక సుఖాలనిస్తాడు. అయితే ఆయన నియమాలను ఉల్లంఘిస్తే భయంకరమైన నరకాగ్నిలో కాల్చివేసే క్రూర యమధర్మరాజుగా మారిపోతాడు. ఆయన నియమాలను ఆచరిస్తూ ముందుకు సాగడమే ఈశ్వరునికి అన్నింటికంటే ఉత్తమమైన పూజ.

సాధారణ మానవుల అంతఃకరణాన్ని ఆత్మ అంటారు. వికసించని కారణంగా దానికి జీవనశక్తి వున్నది. అది వికసించినపుడు అహంభావం విస్తరించి వసుధైక కుటుంబకం రూపంలో పరిణతి చెందుతుంది. అందరూ తన ఆత్మీయులుగానే కనబడతారు. అంతటా ఆత్మ, ఆత్మలో అంతా వున్నట్లుగా కనబడుతుంది. అప్పుడు లఘు ఆత్మ పరమ ఆత్మ (పరమాత్మ) మహా ఆత్మ (మహాత్మ) గా తయారవుతుంది. విశ్వం యొక్క సమృద్ధ ఆత్మయే విశ్వాత్మ లేదా పరమాత్మ. దీనినే సమాజ పురుషుడు, విరాట్ భగవంతుడు, జనార్ధన మొదలయిన పేర్లతో పిలవడం జరుగుతుంది. విశ్వమానవులను ఉపాసించడం, సమాజ పురుషుల సేవ భగవంతుడైన 'ఓం' ని ఆరాధించడవే

అవుతుంది. భగవద్గీతలోని 10 వ అధ్యాయంలో భగవంతుడు " వృక్షాలలో రావి, పశువులలో గోవు, మనుషులలో బ్రాహ్మణుడు, నక్షత్రాలలో చంద్రుడు, గ్రహాలలో సూర్యుడు, ఇంద్రియాలలో మనసు, పర్వతాలలో హిమాలయాలు, పక్షులలో గరుడుడు, నదులలో గంగా, మంత్రాలలో గాయత్రీ మంత్రం, ఋతువులలో వసంతం నేనే" అని చెప్పాడు. అనగా శ్రేష్ఠము, సాత్వికము, సుదృఢము మరియు ఉపయోగకరమైన శక్తులన్నింటిలోనూ నా అంశే ఉన్నది. ఏ ఆలోచనలలో, వ్యక్తులలో, వస్తువులలో ఇలాంటి తత్వాలు అధికంగా వుంటాయో వాటిలో ఈశ్వరుని కళలను ప్రత్యేకంగా అనుభవించవచ్చు. ప్రభువు నివాసమున్న చోట ఖచ్చితంగా శ్రేష్ఠత్వానికి సాత్వికతకు, దృఢత్వానికి మరియు

పరోపకారానికి ప్రాధాన్యత ఉంటుంది. ప్రయత్నం మీద అనేక చోట్ల అలాంటి ప్రభువు నివాసాన్ని అన్వేషించి దర్శించి తృప్తిపడవచ్చు. ఇందువలనే సత్సంగంలో భగవంతుడు వుంటాడని చెబుతారు. ప్రాచీన కాలంలో సత్పురుషులు అధికంగా నివసించడం వలన తీర్థాల మహిమ ఉండేది. తీర్థయాత్రలు పుణ్యఫలంగా భావించేవారు. ఈ రోజు కూడ మహాపురుషుల నివాసాలు ప్రత్యక్ష తీర్థాలే.

రాముడు, కృష్ణుడు మొదలయిన వారి సుందర కాంతులను, వారి గుణాలను ధ్యానించడం వారి ఉన్నత ఆదర్శాలను లక్ష్యంగా చేసుకోవడమే. పెద్దపెద్ద భవనాలు నిర్మించాలంటే ముందు వాటి నమూనా తయారుచేస్తారు. వాటి ఆధారంగా విశాల భవనాలు నిర్మించబడతాయి. మనం

ఆరోగ్యం, సౌందర్యం, బలం, గుణం, విశేషతలు మొదలయిన వాటి దృష్టితో ఏ ఆత్మ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవాలి, ఆ నమూనాతో అనన్య ప్రేమ మరియు పొందుల తీవ్ర అభిలాషను ఉత్పన్నం చేసుకోవాలి. అందుకోసం భగవంతుని కల్పిత రూపాలను ధ్యానిస్తాము. మందిరాలు, మఠాలు, ఆత్మజ్ఞాన ప్రచార కేంద్రాలు. ఆ కేంద్రాల కార్యకర్తల గౌరవార్థం, జీవనయాపనకు దేవాలయాలలో దక్షిణ ఇవ్వడం, పూజ మొదలయిన విధి, వ్యవస్థ తయారవుతుంది. ఈనాడు ఆ పరిస్థితులన్నీ గందరగోళంగా తయారయ్యాయి. అనాచార ధూర్తత్వం, మూర్ఖత్వం ఎక్కువైంది. అయితే కొద్దిపాటి ప్రయత్నంతో ప్రాచీన ఆదర్శాలను పునరుజ్జీవింప చేయవచ్చు. భగవంతుని పూజ ఆధారంగా ధర్మ,

సమాజ, జాతీయ, సాంస్కృతిక మరియు సామాజిక సదాచారాలను మరల ఉద్ధరించి విశాల ప్రణాళికను తయారు చేయవచ్చు. ఇందుకోసం దేవాలయాలు, మఠాలు మరియు పురోహితులను సంస్కరించి వారినే కేంద్ర బిందువులుగా కార్యాన్ని సాధించవచ్చు.

గాయత్రీ మంత్రంలోని ప్రథమ అక్షరం 'ఓం' ఈ విషయాలలోనే శిక్షణనిస్తుంది. ఇది ఈశ్వరుని అత్యున్నత నామము. దీనిని ఉచ్చరించడంతో సూక్ష్మ ప్రకృతి ఆత్మచేతనతో సంబంధం ఏర్పరుచుకునే సాధన తనకు తానుగా జరుగుతుంది. ఇది ఈశ్వరుని స్వయం ప్రకటిత అన్నింటికంటే చిన్న నామము. అంతేగాక గాయత్రీ గీత ఆ ఈశ్వరుడు న్యాయకారి, ప్రభువు, సమదర్శి, అవినాశి, చైతన్యం, ఆనంద స్వరూపి,

నియమ రూపుడు, నిరాకారుడు మరియు విశ్వాత్మ అని చెబుతోంది. ఈ నామాలలో దాగి ఉన్న తత్వజ్ఞానాన్ని తెలుసుకొని ఆచరించి 'ఓం' ఉపాసన చేయాలి.

'ఓం' లో మూడు అక్షరాలు కలసి ఉన్నాయి. అ,ఉ,మ. 'అ' అనగా ఆత్మపరాయణత. శరీర విషయాలను మనసునుండి తొలగించి ఆత్మానందాన్ని ఆనందించడం. 'ఉ' అనగా ఉన్నతి, శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక మరియు ఆత్మిక సంపదను వృద్ధి చేసుకోవడం. 'మ్' అనగా మహిమ. క్షుద్రత, సంకీర్ణ, స్వార్థం, ఇంద్రియ లాలసత్వాలను వదిలిపెట్టి ప్రేమ, దయ, ఉదార, సేవ, త్యాగం, సంయమనం మరియు ఆదర్శాల తో జీవించడం. ఈ మూడు అక్షరాలలో ఉన్న శిక్షణను అనుసరిస్తూ వ్యావహారికంగా 'ఓం' మరియు ఈశ్వరుని ఉపాసన చేయాలి.